క్లుప్తంగా

దైవచింతనతో మానసిక ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎంపీపీ దంపతులు

కేశంపేట: దైవచింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే ఎల్గనమోని అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో శ్రీశ్రీశ్రీ భూదేవి, శ్రీదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం దేవాలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దంపతులు, మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్ దంపతులు హోమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హోమం నిర్వహించడంతో శాంతి, ఐశ్వర్యం, కార్యసిద్ధి కలుగుతుందన్నారు. సోమవారం స్వామివారి కల్యాణం జరుగనుందని, ఆ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికి కృషి

బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్‌పటేల్



అంబేడ్కర్ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేస్తున్న నాయకులు

షాద్‌నగర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్‌పటేల్ అన్నారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్‌పటేల్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహాలను పాలతో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, సమన్యాయం అందాలనే ఆలోచనతో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన అహర్నిశలు కృషి చేశారని, అంబేడ్కర్ ఆశయ సాధనకు బీజేపీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్‌దేశ్‌ముఖ్, కుర్మయ్య, ప్రశాంత్, ప్రభాకర్, రవిగౌడ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వెంకట్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ సహకారంతో ఆక్యూప్రెషర్, మాగ్నెటిక్, సుజోక్ థెరపీ వైద్య శిబిరాన్ని ఆదివారం మాజీ సర్పంచ్ బండారి శైలజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సహకారంతో ఈనెల 13 నుంచి 17వ తేదీవరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఐదురోజుల పాటు ఈ వైద్యశిబిరంలో వైద్యసేవలు కొనసాగుతాయని చెప్పారు. మండలంలోని ప్రజలు ఈవైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, మాజీ ఉపసర్పంచ్ టేకుపల్లి శ్రీనివాస్‌యాదవ్, బ్రహ్మకుమారి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు పరామర్శ

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, రాష్ట్ర చెంచు యువజన సంఘం అధ్యక్షుడు మండ్లి రాములు మాతృమూర్తి మండ్లి జంగమ్మ ఆదివారం మృతిచెందారు. మండలం శంకరకొండతండాలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. అనంతరం రాములును పరామర్శించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యం.. దైన్యం



శిథిలావస్థలో కేతిరెడ్డిపల్లి పశువైద్యశాల

- సిబ్బంది కొరతతో మూతబడ్డ పశువైద్యశాల
- మూగజీవాలకు అందని వైద్యసేవలు
- ఇబ్బంది పడుతున్న పాడి రైతులు

మొయినాబాద్‌రూరల్: పశువైద్యశాలల్లో వైద్యసిబ్బంది కొరత కారణంగా మూగజీవాలకు సరైన వైద్యం అందడం లేదు. పశుపోషణపై ఆధారపడిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జీవాలకు జబ్బు చేస్తే నయం చేసేందుకు డాక్టర్లు కరువయ్యారు. సిబ్బంది కొరత పాడి పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి పశువైద్యశాల గత నాలుగైదు సంవత్సరాల నుంచి తెరుచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. సిబ్బంది కొరత కారణంగా వైద్యకేంద్రం మూతబడడంతో పాడిరైతులకు పశుపోషణ పెనుభారంగా మారింది. పశువైద్యశాలలో డాక్టర్ ఉన్నా నామమాత్రమే అని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్యారా సిబ్బంది, అటెండర్ లేరు. దీంతో ఈ ఆస్పత్రి కొన్నేళ్ల నుంచి తాళం వేసి ఉండడంతో కిటికీలు, తలుపులు విరిగిపోయాయి. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వం గ్రామాల్లో చేపడుతున్న ఉచిత వైద్య శిబిరాలు మాత్రం నామమాత్రంగానే జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి సిబ్బందిని నియమించి, నూతన పశువైద్యశాల నిర్మాణంవైపు దృష్టిసారించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

కేతిరెడ్డిపల్లి పశువైద్య శాల పరిధిలో...

మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి పశువైద్య పరిధిలో కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి, తోల్‌కట్ట, ఎత్‌మార్‌పల్లి ఆయా గ్రామాలు ఈ పశువైద్యశాల పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో దాదాపు ఆవులు, దూడెలు 4 వేలకు పైగా ఉండగా.. మేకలు, గొర్రెలు 8 వేలకు పైగా ఉన్నాయి. సిబ్బంది కొరత కారణంగా వైద్యకేంద్రం మూతబడడంతో పశుపోషణ పెనుభారంగా మారిందని ఆరోపిస్తున్నారు. నాలుగైదేళ్లుగా భవనం మూతబడడంతో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని, ప్రభుత్వం స్పందించి నూతన భవనం నిర్మించాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి తమ ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



కేతిరెడ్డిపల్లి పశువైద్యశాల మూతబడడంతో శిథిలావస్థకు చేరింది. రెండు సంవత్సరాల క్రితమే ప్రభుత్వానికి గ్రామ పంచాయతీ ద్వారా తీర్మానం చేసి పంపించాం. పశువైద్య కేంద్రంలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి, నూతన భవనం నిర్మిస్తే చుట్టు పక్కన గ్రామాల పాడి పశువులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రభుత్వం కృషి చేయాలి.

–దారెడ్డి శోభావెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కేతిరెడ్డిపల్లి

అధికారులకు నివేదించాం



కేతిరెడ్డిపల్లిలో గల పశువైద్యశాల సబ్‌సెంటర్ పలు గ్రామాలకు పని చేస్తోంది. ఈ సబ్‌సెంటర్‌లో ప్యారా సిబ్బంది, అటెండర్లు లేరు. దీంతో ఆ పశువైద్యశాల తెరుచుకోవడం లేదు. భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీనిపై అధికారులకు నివేదించాం.

–డాక్టర్ అహ్మద్, మండల పశువైద్యాధికారి

ఆదమరిస్తే అంతే!



సాయిబాబా దేవాలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నేలపై వేలాడుతున్న తీగలు



దాదూమందిర్ సమీపంలో దిమ్మె సగం కూలిపోవడంతో ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్

- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- నేలపై వేలాడుతున్న కరెంట్ తీగలు
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్‌రూరల్: ఇళ్ల ముందు కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, నేలపై వేలాడుతున్న విద్యుత్ తీగలు.. వీటితో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. దీంతో ప్రజలు భయం భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. విద్యుత్ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇళ్లు, పాఠశాలలకు వెళ్లే దారుల్లో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో సాయిబాబా దేవాలయం సమీపంలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నేలపై వేలాడుతున్న తీగలు ఇళ్ల ముందు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా దాదూమందిర్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె సగం కూలిపోతూ నేలకు ఒరిగి ఉండడంతో ఆ రహదారిపై వెళ్లే ప్రయాణికులు, ప్రజలు బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు. ఎన్‌టీఆర్ పాఠశాలలకు వెళ్లే రహదారిపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ఇటూ ప్రభుత్వ పాఠశాలలు, అటూ ప్రైవేటు పాఠశాలలతో పాటు ఇళ్లల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే సంబంధిత ఉన్నతాధికారులు ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రాజ్యాంగంతో అన్ని వర్గాలకు మేలు



సభలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: రాజ్యాంగం ద్వారా కేవలం దళితులే కాదు అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. శనివారం రాత్రి మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విగ్రహ దాత చేవెళ్ల స్వామి ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభివృద్ధికి అంబేడ్కర్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి, టీపీసీ కార్యదర్శి గౌరీ సతీశ్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రస్తుత సమాజంలో అందరికీ గౌరవం దక్కుతుందని, ఆయన స్ఫూర్తితో ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు కిష్టయ్య, నర్సింహారావు, బాలకృష్ణ, రాఘవాచారి, గోపాల్, రాంచందర్, వెంకటేశ్, మహేందర్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.

ఉత్సవాలను కలిసిమెలిసి జరుపుకోవాలి



స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న నాయకులు

టీపీసీసీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీశ్

మొయినాబాద్‌రూరల్: భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను అందరూ కలిసిమెలిసి జరుపుకున్నప్పుడే ఎంతో ఆనందాన్ని ఇస్తాయని టీపీసీసీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీశ్, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్కెపల్లి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో గల మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాణయ్య, నవపేట్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలు, మొయినాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటాపూర్ మహేందర్‌రెడ్డి, గణేష్, కేబుల్ రాజు, విఠల్, భిక్షపతి, బాకారం మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రను విజయవంతం చేయండి

కేశంపేట: ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టనున్న మా భూమి రథయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో నుంచి సోమవారం మా భూమి రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. మూడు సంవత్సరాల మూడునెలల పాటు లక్ష కిలోమీటర్ల వరకు ఈ రథయాత్రను విశారదన్ మహారాజ్ నిర్వహించనున్నారని, బీసీ, ఎస్సీ, ఎస్టీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసమే విశారదన్ మహారాజ్ రథయాత్రను నిర్వహిస్తున్నారని వెల్లడించారు.

చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత



మన ఊరు మన చెరువు కార్యక్రమంలో యూత్ సభ్యులు, కార్మికులు

తుర్కయంజాల్: చెరువులు, కుంటలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లికి చెందిన హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు బాలు, ప్రవీణ్, ఆకాష్‌లు అన్నారు. మన ఊరు మన చెరువు కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రాహ్మణపల్లిలోని చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను మున్సిపల్ కార్మికులతో కలిసి తొలగించారు. నీటి వనరుల్లో వ్యర్థాలను వేసి పర్యావరణ కాలుష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో పలువురు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్వయంశక్తితో ఎదిగినప్పుడే గుర్తింపు

ప్రగతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అలోక్ అగర్వాల్



కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ అలోక్ అగర్వాల్

షాద్‌నగర్: మహిళలు స్వయంశక్తితో ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ప్రగతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అలోక్ అగర్వాల్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఎవరిపై ఆధారపడకుండా స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళలకు ఇది చక్కని అవకాశమని, సమయపాలన పాటించి కుట్టు శిక్షణలో మంచి నైపుణ్యాన్ని సంపాదించాలన్నారు. అనంతరం డాక్టర్ సంగీత అగర్వాల్ మాట్లాడుతూ.. మహిళలు వృత్తితో పాటుగా వ్యక్తిగత ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. మహిళలు పురుషులకు దీటుగా స్వతాహాగా ఉపాధి మార్గాన్ని ఏర్పరచుకొని జీవితంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్ శంకర్, ప్రోగ్రాం మేనేజర్ మురళీకృష్ణ, ట్రైనర్ తులసి, సిబ్బంది జగదీశ్, కార్తీక్, ప్రగతి, శ్రీకాంత్, లావణ్య, శృతి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అక్రమ మట్టి తవ్వకాలు



ఉమ్మెంత్యాలలో మట్టి తవ్వకాల కోసం సిద్ధంగా ఉన్న వాహనాలు

- సెలవు రోజులను ఎంపిక చేసుకొని తరలింపు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కొందుర్గు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. సెలవు రోజుల్లో తవ్వకాలు జరిపితే అధికారులు అందుబాటులో ఉండరని, మట్టి తరలింపునకు అనుకూలంగా ఉంటుందని భావిస్తూ పలువురు ఆదివారం, పండుగ రోజులు, ప్రభుత్వ సెలవు దినాలను ఎంచుకుంటున్నారు. కొందుర్గు, శ్రీరంగాపూర్, చిన్నఎల్కిచర్ల, బైరంపల్లి, ముట్పూర్, మహదేవ్‌పూర్‌తో పాటు జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్, తదితర గ్రామాల్లో జోరుగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అధికారులకు తెలిపినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. తాజాగా ఆదివారం కొందుర్గు మండలంలోని ఉమ్మెంత్యాల గ్రామ శివారులో గల ప్రభుత్వ భూమిలో తవ్వకాలు జరుపుతుండగా గ్రామస్తులు తవ్వకాలకు సంబంధించిన చిత్రాలను సేకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ చిత్రాలు మీడియాలో వైరల్ కావడంతో రెవెన్యూ సిబ్బంది తవ్వకాలు జరుపుతున్న ప్రదేశాన్ని సందర్శించి తవ్వకాలను నిలిపివేశారు. ఈ విషయమై తహసీల్దార్ రమేశ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఉమ్మెంత్యాల గ్రామంలో ప్రభుత్వ భూమి పక్కనే ఉన్న ఓ పట్టాదారు తన పొలంలో మట్టి తవ్వడానికి జేసీబీ ట్రాక్టర్లు సిద్ధం చేయగా.. తనకు సమాచారం వచ్చిందని, వెంటనే తవ్వకాలను నిలిపివేశామని తెలిపారు.

ప్రాచీన కళలను భావితరాలకు అందిద్దాం

తెలంగాణ సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్



మాట్లాడుతున్న శివకుమార్

షాద్‌నగర్: ప్రాచీన కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం మనందరిపై ఎంతైనా ఉందని తెలంగాణ సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రతి పౌర్ణమి రోజున తెలంగాణ చలన చిత్ర అభివృద్ధి సంస్థ, భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయశాఖ సంయుక్త సౌజన్యంతో రంగక్షేత్ర, రంగస్థల కళల విద్యాలయం, నటమండలి హైద్రాబాద్ వారి ఆధ్వర్యంలో ×రంగస్థల ప్రకాశనమ్÷ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం రాత్రి రంగక్షేత్ర కళాకారులతో శ్రీకృష్ణ రాయబారం, రామాంజనేయ యుద్ధం, సీతాకల్యాణం పౌరాణిక నాటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శివకుమార్ హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచం టెక్నాలజీ పేరుతో మన సంస్కృతి, సంప్రదాయాలకు దూరమవుతుందన్నారు. వినోదం, విజ్ఞానం టీవీ, సెల్‌ఫోన్‌లో ఉండదని, పూర్వ కాలపు కళలు, నాటకాలలో మన సంస్కృతి, సంప్రదాయాలు ఇమిడి ఉంటాయని, బంధాలు, కుటుంబ విలువలు, మన నాగరికతను తెలియజేస్తాయని పేర్కొన్నారు. అలాంటి ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు, కళాకారుడు టీవీ.రంగయ్య మాట్లాడుతూ.. మానవ జీవన వికాసానికి, నైతికతకు, ఆధ్యాత్మికతకు ప్రాచీన కళలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రతీ పౌర్ణమికి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని, నా వంతు సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. అనంతరం కళాకారులను రంగస్థల నటులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కళాకారులు శివప్రసాద్‌జీ, ప్రభాకర్‌చారి, భాస్కర్‌గౌడ్, కృష్ణ, రమేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చేవెళ్ల: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చేవెళ్ల: మండలంలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 సంవత్సరంలో పదో తరగతి పూర్తయిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆలూరులోని కె.శేఖర్‌గౌడ్ ఫాంహౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను వేదికపైకి పిలిచి సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారందరూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని రోజంతా సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారావు, చంద్రశేఖర్‌రెడ్డి, దశరథ్, కృష్ణగౌడ్, ఇంతియాజ్, సాదాత్‌అలీ, కిష్టయ్య, సయ్యద్ సలీం, నర్సింలు, మల్లేశ్, రాంచంద్రర్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

25 సంవత్సరాల తర్వాత..


మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని చెందానగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత చిన్నమంగళారం సమీపంలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఒకరికొకరూ పరిచయం చేసుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషపడ్డారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గౌరీ శంకర్, సత్తయ్య, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, కాంచన, వనజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకొని..

మొయినాబాద్: 30ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదువుకున్నవారంతా ఆదివారం మళ్లీ ఒక్కచోట కలిశారు. పాఠశాల రోజులను.. మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకొని నాడు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సన్మానించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ పరిధిలోని సరస్వతీ విద్యాపీఠం పాఠశాలలో 1995–96లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మున్సిపల్ పరిధిలోని డ్యూడ్రాప్ ఫాంహౌస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 200మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరై ఒకరికొకరూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు రామచంద్రారావు, ఆచార్యులు తిరువెంగళం, గొడుగు సత్యనారాయణ, సుధాస్రవంతి, పూర్వ విద్యార్థులు రవికాంత్‌రెడ్డి, మేకల రవి, మల్లికార్జున్‌రెడ్డి, ప్రవీణ్, మల్లారెడ్డి, చంద్రిక, వసంత, శిరీష, శ్రీకాంత్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: చిన్నమంగళారం సమీపంలోని ఫామ్‌హౌస్‌లో..



మొయినాబాద్: అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు